క్లుప్తంగా

ట్రెయినీ ఎస్‌ఐగా పవన్



వాహనదారులకు సూచనలు చేస్తున్న ట్రెయినీ ఎస్‌ఐ

వైరా: వైరా ట్రెయినీ ఎస్‌ఐగా వి.పవన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం మణుగూరుకు చెందిన ఆయనను ఇటీవల వైరాకు కేటాయించారు. తొలిరోజు వాహనాల తనిఖీల్లో పాల్గొన్న పవన్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే తీసుకునే చర్యలు, హెల్మెట్ ఆవశ్యకతపై సూచనలు చేశారు.

సత్తుపల్లి తహసీల్దార్‌గా శివకుమార్



శివకుమార్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి తహసీల్దార్‌గా ఎ.శివకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ యోగేశ్వరరావు వ్యక్తిగత కారణాలతో నెలరోజుల పాటు సెలవుపై వెళ్లారు. శివకుమార్ గతంలో నాయబ్ తహసీల్దార్‌గా ఇక్కడ పని చేశారు.

ఆస్తిపన్ను చెల్లించండి



పన్ను స్వీకరిస్తున్న కమిషనర్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్నులు, ఇతర ట్యాక్స్ వసూళ్లకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ చింతల వేణు ఆధ్వర్యాన గురువారం పలువురి ఇళ్లకు వెళ్లి పన్నులు వసూలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.4కోట్ల లక్ష్యంతో గురువారం రూ3.68,298 వసూలయ్యాయని ఆయన తెలిపారు. పూర్తి స్థాయిలో వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని వెల్లడించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు జెడ్పీఎస్ఎస్ విద్యార్థులకు గురువారం తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. సామినేని రామప్పారావు కుమారుడు కోదండ రాం పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో ప్యాడ్లు, కంపాక్స్ బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జక్కంపూడి కిషోర్, పాఠశాల హెచ్‌ఎం జోసఫ్, సామినేని రామప్పారావు, రాందాస్, రమేష్, లచ్చయ్య, రామకృష్ణ, నాగుల్‌మీరా, రాంబాబు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కల్లూరు: ప్రభుత్వాస్పత్రి కార్మికులకు గత నాలుగు నెలలుగా రావాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్న నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు మాట్లాడుతూ.. నాలుగు నెలలు గడుస్తున్నా తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో వేతనాలు అందక కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీంతో వారి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇకనైనా వేతనాలు చెల్లించాలని, లేకపోతే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దామాల దయాకర్, కార్మికులు వంశీ, సురేంద్ర, నాగమణి, కోటేశ్వరి, నాగమణి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వైరా బస్టాండ్ వెనుక గేట్లు మూసివేత

వైరా: వైరా ఆర్టీసీ బస్టాండ్‌లోని వెనక వైపు ఉన్న రెండు గేట్లను అధికారులు మూసివేశారు. ఈ గేట్ల ద్వారా ప్రైవేట్ వాహనాలు వచ్చివెళ్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాముందని గుర్తించిన అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో అన్ని ప్రాంతాల నుంచి వచ్చివెళ్లే బస్సులు ముందు ఉన్న గేట్ల నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. కాగా, వైరా బస్టాండ్ వెనకాల ఖాళీ ప్రదేశంలో త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఏజీపీ పోస్టు కేటాయించాలి

ఖమ్మంలీగల్: సత్తుపల్లి అదనపు జిల్లా జడ్జి కోర్టుకు అదనపు గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ) పోస్ట్ కేటాయించాలని న్యాయవాది తాళ్లూరి దిలీప్ కోరారు. ఈ సందర్భంగా గురువారం ఆయన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. సత్తుపల్లి అదనపు జిల్లా జడ్జి కోర్టులో హైవే, సింగరేణికి సంబంధించి కేసులు ఉన్నందున ఏజీపీ పోస్టు కేటాయించాలని కోరారు.

మాకు వాటా దక్కాల్సిందే..

ఏన్కూరు: ఎస్సీ వర్గీకరణలో మా పదకొండు శాతం వాట మాకు దక్కాల్సిందేనని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యంగళ నరేష్ మాదిగ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.

మక్కపైనే మక్కువ



కొణిజర్లలో సాగు అవుతున్న మొక్కజొన్న

ప్రత్యామ్నాయ పంటగా సాగు

- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- కొణిజర్ల, ఏన్కూరు మండలాల్లో 20వేల ఎకరాల్లో సాగవుతున్న మొక్కజొన్న
- రైతులను ప్రోత్సహిస్తున్న కంపెనీలు

కొణిజర్ల: ఏటా యాసంగిలో మొక్కజొన్న సాగు సాంప్రదాయ సాగుగా మారినప్పటికీ ఈ ఏడాది రైతుల ఆలోచన భిన్నంగా మారింది. ఓ వైపు పెట్టుబడులు, మరో వైపు కూలీల కొరత వాతావరణ ప్రతికూలతలతో ఇబ్బందులు పడలేక రైతులు సీడ్ మక్కల సాగుకే మొగ్గు చూపుతున్నారు. కొణిజర్ల మండలంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో ఈ ఏడాది రైతులు దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తుంటే అందులో దాదాపు 70శాతం సీడ్ మొక్కజొన్న వైపే రైతులు మొగ్గు చూపారు.

18వేల ఎకరాల్లో సాగు..

కొణిజర్ల మండలంలో ఈ ఏడాది యాసంగిలో రైతులు దాదాపు 18వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. దీనిలో 8వేల ఎకరాలకు పైగా సీడ్ మొక్కజొన్నే సాగు చేశారు. సాధారణంగా డిసెంబర్‌లో విత్తిన మొక్కజొన్న 90రోజులు అంటే దాదాపు మార్చి నాటికి కోతకు వస్తుంది. ప్రతి ఏటా ఆ సమయంలో తుఫాన్లు, గాలి దుమ్ములు రావడం ఆనవాయితీగా మారింది. దీంతో నాటు రకం మొక్కజొన్న కింద పడిపోయి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చుతుంది. కిందపడిన మక్కలను మిషన్లతో కోయడం కుదరదు కావున.. కూలీలతో కోయించాలంటే అదనంగా ఖర్చు పెరుగుతుంది. సాధారణ మొక్కజొన్న పెట్టుబడుల నుంచి ఎరువులు, అన్ని రైతుకు తడిచి మోపెడవుతుంది. చివరికి అంతా సక్రమంగా ఉందనుకుంటే గిట్టుబాటు ధర ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. దీంతో రైతులు సాంప్రదాయ నాటు రకం నుంచి కంపెనీ సీడ్‌కు మారారు.

కంపెనీల విస్తృత ప్రచారం..

ఈ ఏడాది పలు కంపెనీల ప్రతినిధులు తమ సీడ్‌లను విస్తృతంగా ప్రచారం చేశారు. మండలంలోని సింగరాయపాలెం, తీగలబంజర, పల్లిపాడు, లాలాపురం, గుబ్బగుర్తి తదితర గ్రామాలకు చెందిన వ్యక్తులను ఏజెంట్లుగా పెట్టుకుని రైతులకు ముందస్తు పెట్టుబడులు పెట్టారు. ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు ముందస్తుగా పెట్టుబడులు పెట్టారు. పంటను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు ఏ మందులు కొట్టాలో అవసరమైతే మందులు కూడా వారే సరఫరా చేస్తున్నారు. పంట పండిన తర్వాత బొండాలతో సహా క్వింటాల్‌కు రూ.3,800 నుంచి రూ.4,500 వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులకు ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు నికర ఆదాయం వస్తుంది. ఈ కారణంగా రైతులు సీడ్ సాగుకే మొగ్గు చూపారు.

పెరిగిన మొక్కజొన్న సాగు

ఏన్కూరు: మండలంలో రైతులు పత్తి పంట అయిపోయిన తరువాత మొక్కజొన్నపై మక్కువ చూపుతున్నారు. గత ఏడాది 500 ఎకరాలు మొక్కజొన్న సాగుచేయగా.. ఈ ఏడాది 2వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఈ సాగుకు మండలంలోని భూమి అనుకూలంగా ఉండడంతో కంపెనీలు రైతులకు పెట్టుబడులు, మందులు పంపిణీ చేసి అప్పుడప్పుడు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. కనీసం కూలీల కొరత కూడా లేకుండా మొత్తం కంపెనీ వారే చూసుకోవడం, దిగుబడి రాకుముందే పెట్టుబడి కింద రైతులకు రూ.30వేలు, మందులు ఇవ్వడంతో మొక్కజొన్నపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. దీంతో రైతులకు పంటలు లభదాయకంగా ఉంటుంది.

సాగు విస్తీర్ణం పెరిగింది.



ఈ ఏడాది మండలంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. ఖరీఫ్‌లో పత్తి సాగు ఆశాజనకంగా లేక పోవడంతో రైతులంతా మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపారు. పలుచోట్ల సాగర్ జలాలు పుష్కలంగా ఉండటంతో పోటు మద్దతు ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు కంపెనీ సీడ్ ఎక్కువగా సాగు చేశారు.

– డి.బాలాజీ, ఏఓ, కొణిజర్ల

8 ఎకరాల్లో..



ఈ ఏడాది 8 ఎకరాల్లో సీడ్ మొక్కజొన్న వేశా. కంపెనీ ప్రతినిధులు పెట్టుబడి సాయం అందించడంతో పాటు కొన్ని పురుగు మందులు కూడా వాళ్లే ఇచ్చారు. రేటు కూడా రూ.4 వేల వరకు కొంటామని ముందే హామీ ఇచ్చారు. ఎరువులు, పంట కోయించే కూలీ భరించాల్సి ఉంది. పంట మంచిగా పండితే కొంత లాభదాయకంగా ఉంటుంది.

– ధరావత్ లక్ష్మణ్, రైతు, మెకాలకుంట

పులిగుండాలను సందర్శించిన విద్యార్థులు



పులిగుండాలను సందర్శించిన విద్యార్థులు

మధిర: ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా ఫీల్డ్ విజిట్‌లో భాగంగా మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం పులిగుండాలను సందర్శించారు. మడుపల్లి హైస్కూల్ నుంచి సుమారు 195 మంది విద్యార్థులు పెనుబల్లి మండలంలోని కనకాల రేంజ్‌లో ఉన్న పులిగుండాలను సందర్శించి ప్రకృతి సౌందర్యాన్ని, రిజర్వాయర్, అటవీ వృక్ష జంతుజాలాన్ని ఆసక్తిగా తిలకించారు. డీఆర్‌ఓ సురేష్ కుమార్, జీసీడీఓ తులసి మాట్లాడారు. అడవుల ప్రాముఖ్యతను, జీవ మనుగడను, జల వనరులను సంరక్షించుకోవడం తదితర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన జిల్లా, మండల అధికారులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తోట నరసింహారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాడులో వైభవంగా శివాలయ వార్షికోత్సవం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గుడిపాడులోని శ్రీదుర్గాపార్వతి సహిత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడులకు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి కల్యాణంతో పాటు అభిషేకాలు, హోమపూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్, రిటైర్డ్ జైలర్ నర్సింహారావు, నున్నా రత్నాకర్, కొల్లి నర్సింహారావు, మారుతి బాబురావు, పూచి గోవర్ధన్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న క్షమాపణ చెప్పాలి



సమావేశంలో పాల్గొన్న రెడ్డి సంఘం నాయకులు

తల్లాడ: రెడ్డి సామాజికవర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బేషరతుగా క్షమాపణ చెప్పాలని తల్లాడ మండల రెడ్డి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తల్లాడలో గురువారం సంఘం మండల అధ్యక్షుడు కర్నాటి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇటీవల వరంగల్‌లో జరిగిన బీసీ గర్జన సభలో కులాల మధ్య చిచ్చు పెట్టేలా, రెడ్డి సామాజికవర్గంపై పరుష పదజాలంతో మల్లన్న మాట్లాడడం సరికాదన్నారు. ఇకనైనా ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు గొడుగునూరి లక్ష్మీరెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, వేమిరెడ్డి సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం



పౌష్టికాహారం అందజేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పెనుబల్లి: మండలంలోని లంకాసాగర్ పీహెచ్‌సీ పరిధిలో గర్భిణులకు గురువారం పౌష్టికాహారం అందించారు. ప్రతి గురువారం వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు వీయంబంజర్‌కు చెందిన మిట్టపల్లి సత్యనారాయణ అందించిన విరాళంతో పౌష్టికాహారం అందిస్తున్నట్లు ఆస్పత్రి వైద్యురాలు సౌమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మందడపు అశోక్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది డాక్టర్ ధరణి, సీహెచ్‌ఓ పూలమ్మ, ఎంపీహెచ్‌ఈ శ్రీనివాస్, పీహెచ్‌ఎన్ సుగుణదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలి

మధిర: ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) 2020 సంవత్సరంలో వెయ్యి రూపాయలు చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు మార్చి 31 లోగా ఫీజు చెల్లించాలని మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం నగదు చెల్లించిన వారు 4276 అప్లికేషన్లు ఉన్నాయని, వారు ఎంత ఫీజు చెల్లించాలనే విషయాన్ని సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపడం జరిగిందన్నారు. అదనపు సమాచారం కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను, పంపు పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు బకాయిలు ఉన్న వారు వెంటనే చెల్లించాలని కోరారు.

పరామర్శ..

బోనకల్: ఇటీవల కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి బోనకల్‌కు చెందిన యార్లగడ్డ వరమ్మ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను టీడీపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం స్థానిక నాయకులతో కలసి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ప్రగాఢ సంతాప, సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు రావుట్ల సత్యనారాయణ, నల్లమోతు సత్యనారాయణ,మరీదు బరకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం పట్టుకున్నారు. చిన్నమండవ, తిమ్మినేనిపాలెం మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు స్థానికుడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. కలెక్టర్ ఆదేశాలతో పోలీసులు స్పందించి అక్రమరవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

బైక్ చోరీ

బోనకల్: మండల కేంద్రంలోని రైల్వేగేటు వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనం గురువారం చోరీకి గురైంది. బోనకల్‌కు చెందిన రావుట్ల లక్ష్మణాచారి రైల్వేగేటు వద్ద తన ద్విచక్ర వాహనాన్ని ఉంచి గేటు అవతల వైపు వెళ్లి వచ్చేసరికి బైక్ మాయమైంది. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్సై మధుబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అతే కాకుండా ఇటీవల ఆర్వోబీ బ్రిడ్జి వద్ద ఆటో కూడా చోరీకి గురైనట్టు సమాచారం.

సీఈఐఆర్ సేవలు వినియోగించుకోవాలి

చింతకాని: సెల్‌ఫోన్ దొంగిలించినా, ఎక్కడైనా పోగొట్టుకున్నా వాటిని గుర్తించేందుకు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. దీనితో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఈఆర్ ద్వారా ఏడు ఫోన్లు రికవరీ చేసి సదరు యువకులకు అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలాన్ని పరిరక్షించాలి

మధిర: మధిర పట్టణంలోని వైరా నది సమీపంలో ఉన్న హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ ఆ కమిటీ సభ్యులు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, మాధవరపు నాగేశ్వరరావు, తదితరులు.. ఆర్‌ఐకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల నకిలీ ధృవీకరణ పత్రాలతో ఒక వ్యక్తి శ్మశాన వాటిక స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో ములకలపల్లి మోహన్‌రావు, వనమా సూరి, కుంచం కృష్ణారావు, పిచ్చయ్య, కాలం వీరభద్రరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవుగా ప్రకటించాలి

కల్లూరురూరల్: సేవాలాల్ మహరాజ్ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవుగా ప్రకటించాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దశరథ్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని హనుమాన్‌తండాలో నిర్వహించిన గిరిజన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి రామారావునాయక్, నాయకులు రామకృష్ణ నాయక్, కృష్ణస్వామినాయక్ పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మధిర: మధిర మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై మండల టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల వైద్యాధికారులు పృధ్వీరాజ్ నాయక్, వీరబాబు, నిరోష మాట్లాడుతూ.. ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఒకటో సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయసులోపు ఆడ, మగ పిల్లలచేత అల్బెండజోల్ మాత్ర నమిలి మింగించాలని కోరారు. ఒకటి నుంచి మూడు సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు సగం మాత్ర, పైబడిన వయసువారికి పూర్తి మాత్ర ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ ప్రభాకర్, ఐసీడీఎస్ సీడీపీఓ బాల త్రిపుర సుందరి, వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, శరత్ బాబు, లంకా కొండయ్య పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల వ్యాధి నివారణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల అధికారులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి మాట్లాడుతూ.. అల్బెండజోల్ మాత్రలు వేసుకోవం వలన రక్తహీనత సమస్యను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీఓ రమాదేవి, ఎంఈఓ పుల్లయ్య, ఎంపీఓ శాస్త్రి, సీహెచ్‌ఓ దానయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయిబాబా ఆలయాల్లో సాయినాథుడికి గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. శ్రీసాయికి కర్పూర హారతులిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మీనవోలు, బనిగండ్లపాడు, పెద్దగోపవరం, పెగళ్లపాడు, ఎర్రుపాలెం తదితర గ్రామాలకు చెందిన భక్తులు బాబాని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని సాయి నిలయంలో దాతలు షేక్ ఉద్దండ్, గుర్రాల నారాయణరెడ్డి, సముద్రాల సతీష్‌లు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో కార్మికులకు అన్యాయం



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

బోనకల్: కేంద్ర బడ్జెట్‌తో సామాన్యులు, కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. గురువారం బోనకల్‌లో కేతినేని నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ పెట్టుబడుదారుల, కార్పొరేట్ దారులకు ఉపయోగమే తప్ప దేశ ప్రజలకు ఏరకంగాను ఉపయోగము కాదన్నారు. తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. వ్యవసాయ రంగానికి, ఉపాధి రంగానికి నిధులు కేటాయించలేదన్నారు. పెట్రోల్, డీజిల్‌ని జీఎస్టీ తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గోపాలరావు, మండల కార్యదర్శి సురేష్ నాయకులు నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, తిరుపతిరావు, సునీత, నరేష్, వీరభద్రం, వెంకట అప్పారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి..

కల్లూరు: కేంద్ర బడ్జెట్‌పై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. గురువారం స్థానిక చింతలపూడి జగ్గయ్య భవన్‌లో తన్నీరు కృష్ణార్జునరావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ డివిజన్ కమిటీ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు రమేష్‌తో పాటు ఆమె మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణకు బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాండురంగారావు, శ్రీనివాసరావు, విఠల్, కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండల కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రామలింగేశ్వరరావు, తిరుపతిరావు, జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

పాలాభిషేకం

కల్లూరు: కల్లూరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం బీసీ సామాజిక వర్గాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాగమయి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ భాగం నీరజ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ కులాలకు సముచితస్థానం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరసింహారావు, కృష్ణ, భరత్, సత్యంబాబు, వెంకటేశ్వరరావు, కాంతారావు, రామారావు, రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో..



పెనుబల్లి: రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెనుబల్లి: స్థానిక రింగ్‌సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎమ్మెల్యే రాగమయి, కాంగ్రెస్ నేత దయానంద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్‌తోనే ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, నాయకులు బాబురావు, కాంతయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే మిర్చి కొనుగోలు చేయాలి

వైరా: మిర్చి ధర పతనమవుతున్న తరుణాన ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఉద్యమించనున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తెలిపారు. వైరాలో గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేసి క్వింటాకు రూ.25 వేల ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సదస్సుల ద్వారా అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. నాయకులు మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, బొంతు సమత, పారుపల్లి శ్రీనాథ్, సంక్రాంతి పురుషోత్తం, పాషా, వెంకటేశ్వరరావు, మధు, రామకృష్ణ, బత్తిరన్న తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్‌పై మార్చి 2న యుద్ధభేరి

కొణిజర్ల: యూపీఎస్‌కు వ్యతిరేకంగా మార్చి 2న యూపీఎస్ యుద్ధభేరి సభను నిర్వహించనున్నట్లు సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ వెల్లడించారు. గురువారం మండలంలోని పల్లిపాడు ఉన్నత పాఠశాలలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చర్ల శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి రాగి సురేష్, సీపీఎస్ ఉద్యోగులతో కలిసి మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 2న హైదరాబాద్ ధర్నా చౌక్‌లో నిర్వహించే సభకు అందరూ హాజరై జయప్రదం చేయాలన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్: బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి గురువారం బహుమతులు ప్రధానం చేశారు. ఖమ్మంజిల్లా నెహ్రూ యువ కేంద్రం వారి సహకారంతో కేసీఆర్‌నగర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ సత్తుపల్లి జేవీఆర్ కళాశాల గ్రౌండ్‌లో వాలీబాల్, బ్యాడ్మింటన్, 200 మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించగా.. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.పూర్ణచంద్రరావు, పీల్‌సాహెబ్ చేతుల మీదుగా స్పోర్ట్స్‌కిట్లు, మెడల్స్, మెమోంటోలు, సర్టిఫికెట్లు అందించారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు

కల్లూరురూరల్: మండలంలోని పుల్లయ్యబంజర్ వద్ద మిషన్ భగీరథ సిబ్బంది పైప్‌లైన్‌కు గురువారం మరమ్మతులు చేపట్టారు. మండలంలోని పలు గ్రామాలకు మూడురోజులుగా నీటిసరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు భగీరథ అధికారులు తెలిపారు. దీంతో పుల్లయ్యబంజరు వద్ద స్వల్ప లీకుల వల్ల సరఫరా నిలిచిపోయిందని గమనించిన సిబ్బంది మరమ్మతులు నిర్వహించి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

గుండె పోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో 3వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న గజ్జల నాగమణి(62) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. సమాచారం అందుకున్న కల్లూరు మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు చెన్నూరు చేరుకుని నాగమణి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అదే విధంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్, ప్రాజెక్ట్ కార్యదర్శి నాగమణి, సీపీఎం నాయకులు వెంకటేశ్వరరావు, కృష్ణార్జునరావు, ఐసీడీఎస్ సర్కిల్ బాధ్యులు ప్రభావతి, వాణిశ్రీ, శ్రీదేవి, జ్యోతి నివాళులు అర్పించారు. సర్వీస్‌లో ఉండి అంగన్‌వాడీ టీచర్ మరణిస్తే వారసత్వ ఉద్యోగం ఇవ్వాలని విఠల్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.